# సత్యాన్వేషి

లలితాంబిక అంతర్జనం



లోయను దాటి తన కారు కొండ ఎక్కుతూంటే అతనికి ఉత్తేజం కలుగుతూంది. మోక్షార్థియైన యాత్రికుడు కాడతడు, అతనొక శాస్త్రవేత్త. తన పరిశోధనాగారపు నాలుగు గోడల మధ్య హోరెత్తుతూన్న జీవితంనుంచి నాలుగురోజులు విశ్రాంతి తీసుకోవాలనే బయలుదేరాడు. జీవితం ఒత్తిడికి దూరంగానున్న ఈ ప్రదేశం ప్రశాంతంగా, చల్లగా ఆరోగ్యకరంగా ఉంటుందని ఎవరో చెప్పేరు. కాగా, ఇక్కడకు విలాస యాత్రికుడుగా మాత్రమే వచ్చేడు, భక్తుడుగా కాదు.

పరిశోధనాగారపు సంకీర్ణ పరికరాల

నుండి విడివడ్డ అతని మనస్సు మహోత్సాహంతో ఉబుకుతూంది. దారి పొడుగునా దేవాలయశిథిలాలు, చారిత్రాత్మకమైన వస్తువులు చెదిరి పడిఉన్నాయి. లత వృక్ష సమూహాలు వివిధ వర్ణ పుష్ప కిరీటాలను హుందాగా ధరించి ఉన్నాయి. వీటివెనుక మేఘావృత మహోన్నత హిమాలయ శిఖరాలు. తనలోనున్న ప్రకృతి నారాధించే ఆదిమానవుడు ఒక్క క్షణంపాటు పైకిరాగా విజ్ఞానశాస్త్రజ్ఞుడు వెనక్కు జారుకొన్నాడు.

"ఇదొక కొత్త ప్రయోగం కానీ" అంటూ డాక్టర్ చంద్రశేఖర్ పెద్దగా నవ్వేడు. అతనీ ప్రపంచంలో దేని పవిత్రతనూ అంగీకరించే స్థితిలో లేడు. హిమాలయాలు ఎత్తైన పర్వతాలే, బహుశా, ప్రపంచంలోకెల్లా ఎత్తైనవి. అంతకంటె విశేషం లేదు. గంగ పెద్ద నదే, బహుశా, భారతదేశంలోకెల్లా పెద్దది. అంతకంటె విశేషంలేదు.

తమ జీవితాలను వ్యర్థంచేసుకొంటూ ఇటువంటి ప్రదేశాలకు పరుగులుపెట్టే మూఢాచార సంపన్నులంటే అతనికి ఏవగింపు. కాని, అడుగుల్లో అడుగులు వేసుకొంటూ, గులకరాలతో ఆడుకొంటూ భగీరథి ఎంత అందంగా కొండచరియలలో జారుతూంది! ఆనందాతిశయంతో పొంగిపోయే ఐదేండ్ల బాలికవలె లేదా? ఆమె మధుర మధుర మందహాసాలు తెల్లటి నురగగా రూపొందుతున్నాయి. నదీతీరాన ఉన్న చెట్లకొమ్మలు వడిగా ప్రవహించే నదీజలాలలో దాగుడుమూతలు ఆడుతున్నాయి.

తనెంత అకస్మికంగా కవిగా మారిపోయినాడో అనుకొన్నాడు విజ్ఞానశాస్త్రజ్ఞుడు. కారు మెల్లగా నడిపించుకొని పోతున్నాడు. ఇదో లోకం, వేరైన పరిసరాలు. కొందరు రేవులో స్నానంచేస్తున్నారు;కాషాయవస్త్రధారులు గోచీలవారు, నగ్నశరీరులు. అక్కడక్కడ పూజాద్రవ్యాలు, బియ్యపు గింజలు పడివున్నాయి. బహుశా శ్రాద్ధ విధుల అవశేషాలై ఉంటాయి. అంతా యాంత్రికంగా ఉంది. ప్రకృతి సౌందర్య శోభను ఎవరూ గమనించినట్లు కనపడదు.

తన తల్లి బ్రతికి ఉంటే అమె ఇలాగే చేసేదని చంద్రశేఖర్ అనుకున్నాడు. తండ్రి మరణానంతరం ఆమె యాత్ర చేయని పవిత్ర స్థలం లేదు. మొక్కని గుడిలేదు. రామేశ్వర సైకతాలలో నిలబడి, ఒకసారి, చేతులు మోడ్చి, అర్ధనిమీలిత నేత్రాలతో ప్రార్థించింది: "దేవా! నా పుత్రుని ఆనందపూరిత భర్తగా ఆనందాతిశయ పూరిత తండ్రిగా ఆశీర్వదించు!"

ఎంత మూఢ నమ్మకం! తన పుత్రుని శరీరాత్మలను కాపాడమని ఒక బధిరాంధ పాషాణాన్ని, ఒక విగ్రహాన్ని అర్థించడం? తను యదార్థ జీవితంలో దేనిని పొందలేకపోయిందో దానిని

మావారి మంచితనం




భావనాత్మకంగా పొందే ప్రయత్నమేమో? ఆమెతో వాదించి ప్రయోజనం లేదు. అందుకే ఊరుకొన్నాడు. ఆమె మరణానంతరం నా అన్నవారు లేక పోయేరు. ఆమె మనుమడింకా కాల గర్భంలోనే ఉన్నాడు. ఆమె బ్రహ్మచారి పుత్రుడు శాస్త్రపరిశోధనలు చేస్తూ సముద్రాల కవ్వలనున్నాడు.

అబ్బా! ఎప్పుడో మరచినవి. ఈ స్మృతులిప్పుడెందుకు వచ్చినట్లు?

## 2

నూటుతో నున్న తన చుట్టూ బిచ్చగాళ్ళు మూగేరు; కుష్ఠురోగులు, అంధులు, వికలాంగులు. ఇదీ భారతదేశం! మన భారతదేశం! భిక్షాటనను గొప్ప వృత్తిగా అంగీకరించిన దేశమింకేదైనా ఉందా? ఆరోగ్య కేంద్రాలలో సైతం ఘోర వ్యాధులను ఈ భిక్షకులు వ్యాపింపచేస్తారు.

ఈ ప్రదేశానికీ తన దుస్తులకు గల వైరుధ్యం ఆకస్మికంగా స్ఫురించింది. చాలా కాలం విదేశాలలో ఉండటం మూలాన, భారతదేశాన్ని, భారతీయ జీవితవిధానాన్నీ అతను మరచిపోయేడు. తన భావవాహిని కల్లోలితమైంది. సామాన్య యాత్రికునివలె ఒక్కరోజు జనసందోహంతో ఎందుకు కలియకూడదు? ఈ ప్రదేశంలో తనను గుర్తించేదెవరు?

స్నానానికవసరమైన పంచ, తువ్వాలు

సూటుకేసునుంచి తీసేడు. సూటు విప్పి పంచ కట్టేడు. ఇప్పుడొక దాక్షిణాత్య శ్రోత్రియ బ్రాహ్మణునిలాగా ఉన్నాడు— యజ్ఞోపవీతం తప్ప. చెట్టునీడలో కారాపి తాళంవేసి, నది ఒడ్డున ధ్యానభావంతో నడక ప్రారంభించేడు. ఇక రెండు రోజులు అటవిడుపు, శారీరకంగాను మానసికంగా ను కూడ. ఎంతో కాలంగా విశ్రాంతి సుఖం ఎరగడు.

తన తల్లి మరణానంతరం తన బంధువులగురించికాని, అనుబంధాల గురించికాని యోచించలేదు. ఇంగ్లండు, అమెరికా, జర్మనీ దేశాల పరిశోధన కేంద్రాలలో ఎన్నో ఏండ్లు పనిచేసేడు. తనకుగా తాను నియమించుకొన్న అన్య దేశవాసం. పరిశోధనాగారానికి ఆవల నున్న ప్రపంచం గురించి యోచనే లేదు. జగత్తులో అనేక భౌతిక దృగ్విషయా లను ఆవరించిన రహస్య యవనికలను తొలగించడానికై తీవ్రంగా కృషి చేస్తున్నాడు.

గంగమీదనుంచి వీస్తున్న మంద మారుతం శరీరాన్ని జోకొడుతూంది. ఒంటరిగానున్నాడు. చాలా దూరం వచ్చినట్లుంది. ఘోషతో మెలికలు తిరుగుతూ అద్భుతంగా నది ప్రవ హిస్తూంది. పక్షుల కలకలారావం. అప్పుడే కొండ వెనుక అదృశ్య మవ్వ బోతూన్న సూర్యుడు వెచ్చటి కిరణాలు ప్రసరిస్తున్నాడు. ప్రకృతి సౌందర్యాన్ని ఉగ్గడిస్తూ, స్వచ్ఛమైన గాలి అనుభ విస్తూ ఒంటరిగా విలుచున్న డాక్టర్ని ఒక దృశ్యం ఆకర్షించింది.

ఎర్రటి జుత్తు, నీలం కళ్ళు, ఎండకు కాస్త గోధుమరంగుతేలిన శరీరచ్ఛాయ, రూపంలోను వస్త్రధారణలోను వికారంగా నున్న ఒక వ్యక్తి బండరాతిపై కూర్చు న్నాడు. అతను విదేశీయుడే. సందేహం లేదు. భారతీయ సన్యాసివలె ఒక పంచ కట్టేడు. వాని భుజాలపై ఒక కోతి ఉంది. దాని ముఖాన్ని పట్టుకొని వెక్కి రిస్తున్నాడు. అదీ వెక్కిరించింది. వాని భుజాలపైకెక్కింది. దానికి గిలిగింతలు పెట్టేడు. అదీ గిలిగింతలు పెట్టింది. వాని బుర్ర గోకింది. దానిని వదలించు కోడానికి విదిలించేడు. కొంతసేపు తమాషాగా కొట్లాడిన తరవాత ఒక్క కిచకిచతో వానిని వదలి పెద్ద చెట్టు కొమ్మల్లోకి కోతి పారిపోయింది.

పట్టణాలలో గడిపే అతివేల జీవితాల మూలంగా మనశ్శాంతి పోగొట్టుకొని వెర్రితలలు వేసే విదేశీయ హిప్పీలను బీట్నిక్‌లను చాలామందిని చంద్రశేఖర్ చూసేడు. హిమాలయ ప్రాంతంలో యోగులతో అట్టివారు నివసిస్తున్నారని విన్నాడు.

ఆ సన్యాసికి చంద్రశేఖర్ ఉన్నా డన్న గుర్తులేదు. గంగానదీ హిమ జలాలలో పాదాలను ఆడిస్తూ, నీరు త్రుళ్ళిస్తూ కూర్చున్నాడు. చంద్రశేఖర్

వాని వద్దకు వెళ్ళి స్వచ్ఛమైన ఇంగ్లీషులో

"అది పెంపుడు కోతేనా ?"

"కాదు. దానిని మచ్చికచేసుకోడానికి ప్రయత్నిస్తున్నాను." అని వచ్చీ రాని హిందీలో జవాబు.

"మీరు విలాసయాత్రీకు లనుకొంటాను. హిప్పీలా ?"

ఒక విధంగా ప్రకృతి బాహ్య శోభను అనుభవిస్తూ విలాసయాత్రీకుడు సంచారం చేస్తాడు. కానీ, నేను ఆత్మను అన్వేషిస్తున్నాను."

"ఆత్మ అంటే ?"

"నా కింకా తెలీదు. కాని అలా అన్వేషణ చేస్తూనే ఉన్నాను."

"మీకు జయం కలిగితే నాకు కొంచెం చెప్పండి."

"తప్పకుండా.... నీకా యోగ్యత ఉంటే." అంటూ ఒక వెకిలినవ్వుతో అడవులవైపు నిష్క్రమించేడు; బహుశా ఆ కోతిని వెతుకుతూ.

చంద్రశేఖర్ ఆశ్చర్యపోయేడు. అస్తిత్వం లేనిదానికోసం అన్వేషిస్తూన్న ఒక వికృత మానవుడు. ఇదికూడా ఒకప్పుడు ఫాషన్ కావచ్చు. భౌతిక సుఖాలతో విసుగెత్తిన తరువాత ఆదిమ భావాలెట్లుంటాయో తెలుసుకోవాలన్న కుతూహలం. అవును, హిప్పీలకు కూడా గురువులుగా వ్యవహరించగల యోగులు హిమాలయాలలో ఉన్నారు.

## 3

అప్పుడే చీకటిపడుతూంది. ఆ రాత్రి ఎక్కడ గడపటం ? ఊరు కొద్ది దూరంలో ఉంది. అకస్మికంగా ఒక యోచన మెరిసింది. ఈ సన్యాసులతో వారి ఆశ్రమంలో ఎందుకు ఉండకూడదు? నిజంగా అదొక అభూతానుభవం కాగలదు. ప్రపంచ వైముఖ్యం చెందిన విరాగులలో చాలామంది బాగా చదువు కొన్నవారట। వారిలో డాక్టర్లు, ఇంజనీర్లు, తనవంటి విజ్ఞానశాస్త్రవేత్తలు కూడా ఉన్నారు. ఈ విరోధాభాస మూలానికి పోయి, వీలైతే, దానిని పరిష్కరించడానికి ప్రయత్నించాలి.

చంద్రశేఖర్ వెనక్కి మళ్ళేడు ఆ పంచె కండువాలతో మూర్తిలా అతనొక శ్రోత్రియ దక్షిణాది బ్రాహ్మణునిలాగా ఉన్నాడు. వయసు మళ్ళిన ఒకరిని తోవలో పలుకరించేడు. "నాకొక ఆశ్రమానికి దారి చూపిస్తారా ? దూర దేశంనుండి వచ్చేను. ఆత్మజ్ఞానాన్ని అర్థిస్తున్నాను." కనుబొమలెత్తి ఆయన చెప్పేడు-"మద్రాసీకా? హుం." ఒక దూర భవనాన్ని చూపిస్తూ "అదిగో అదొక పెద్ద ఆశ్రమం. ఆ స్వామి మద్రాసీయే. నీ కాయన సరియైన గురువు కావచ్చు." ఆ మాటలలో కొంత ప్రాంతీయ భావం స్పష్టమైంది. చంద్రశేఖర్ అది పట్టించుకోలేదు.

ఆ ఆశ్రమ ప్రాంగణంలో చాలా

మంది సన్యాసులున్నారు. ప్రార్థనానంతరం అప్పుడే సమావేశం పూర్తి అయింది. జనం వెళిపోతున్నారు. గురువుగారిని దర్శించే సమయం కూడా దాటిపోయింది. అక్కడున్న పుస్తకంలో తన పేరు వ్రాస్తే మరునాడు గురు దర్శనం చేసుకోవచ్చు.

తన చిరునామా పుస్తకంలో వ్రాసేడు. తమిళనాడులో ఉన్న తన ఇంటి పేరు, ఇంటి నంబరు, వీధి, తండ్రి పేరు ఎంతో కష్టంతో స్మృతిపథంలోకి తెచ్చుకొని, తన పేరుతో సహా వ్రాసేడు. ఇక భోజనం, నిద్ర.


ఆ ఆశ్రమ వాసులు నడుపుతూన్న హోటల్లో ఒకమూల చేరేడు. వారు పెట్టిన అల్ప భోజనం ఎలాగో తిన్నాడు. అందులో చాలామంది ఉన్నారు. దూర ప్రాంతాలనుండి వచ్చినవారు, వివిధ భాషలు మాట్లాడేవారు, వివిధ ఆచార వ్యవహారలవారు. వారి నాకర్షించింది ఏమిటో? మతమా? తన తల్లి చెబుతూ ఉండిన సన్యాసాశ్రమాలు కేవలం పర్ణశాలలు. ఆహార పానీయాలు లేకుండా వాటిలో ఋషీశ్వరులు ధ్యాన నిమగ్నులై ఉండేవారట! కృషితో పాటు ఫలితం, అంత శ్రమ పడినప్పుడే దివ్యదర్శన మవుతుంది. మరీ ప్రదేశమో రమ్య హర్మ్యాలు, విద్యుత్తు, కార్లు, ఫోన్లు, ప్రచురణ ముద్రణాలయం— సమస్తమైన ఆధునిక సౌఖ్యాలకు ఆలవాలమై ఉంది. ఇక్కడ వారు చేస్తూన్నదేమిటి? విజ్ఞానశాస్త్రం ఆవిష్కరించి ప్రసాదించిన వివిధ పరికరాలతో దాని మీదే ధ్వజమెత్తుతూ, మూఢ భావాలను ప్రచారం చేస్తున్నారు.

కిందకు చూడగా చంద్రశేఖర్‌కు తళతళలాడే నదీజలాలు కనిపించేయి. దూరంలో నీలాంబరాన్ని చొచ్చుకొని పైకిపోతూన్న హిమాలయ శ్వేత శిఖరాలు. ఎక్కడో సైరన్ మోత. దూరంగా ఫ్యాక్టరీ ఉందేమో? ఈ నిర్మల ప్రశాంత ప్రదేశాన్ని పట్టణ కల్మషం తన శతాధిక హస్తాలతో, కొద్ది కాలంలోనే దాడిచేయవచ్చు.

ఉదయాన్నే చంద్రశేఖర్ చన్నీటి స్నానం చేసేడు. గురు దర్శనానికి ఆశ్రమంలో ప్రవేశించేడు. బహుశా ప్రార్థనమందిరంలో గురువున్నారు. లోపల ఎవరో ఘాటుగా వాదిస్తున్నారు. ఆ వ్యక్తి లాటిన్ అమెరికానుంచి వచ్చిన డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అనీ, ప్రస్తుతం సన్యాసి అనీ ఆశ్రమవాసులు చెప్పేరు.

గురువు పిలుపుకి నిరీక్షిస్తున్న చంద్రశేర్‌కు పిలుపు వచ్చింది. కాళ్ళు వెనకకు మడిచి లేడి చర్మంపైన గురువు, ఆసీనులై వున్నారు. ఆయన వృద్ధుడు, స్ఫురద్రూపి, పెద్ద గడ్డం, ముండిత శిరస్సు, కారుణ్య దృష్టి, మందహాసం. గురువుకు మోకరిల్లుతూంటే, వృద్ధ బ్రాహ్మణుడైన తన తండ్రి రూపం

మావారి మంచితనం




చంద్రశేఖర్ మనో నేత్రాలముందు మెరిసింది. తన శీతలకరాలు చంద్ర శేఖర్ తలపై పెట్టి స్వామీజీ అన్నారు- "లే, నాయనా నీ మార్గం సుగమ మవుగాక. సర్వార్థ సిద్ధిరస్తు!"

"నా మార్గమా స్వామీ! అదేదో మీకు తెలుసునా?"

"నే నెరుగుదును నాయనా! సత్య చిహ్నం సర్వదా గోచరమే. నీవు సత్యాన్వేషివి. విశ్వ సత్యం అన్వేషించే వారికి వైఫల్యం ఉండదు."

ఓహో, ఈ చవకబారు మాటలచేత తన లక్ష్యంనుంచి మార్చలేరని చంద్ర శేఖర్ అనుకొన్నాడు.

"అయితే, నా మార్గం విజయవంత మవుతుందంటారా? అప్పుడు మరి మీ మార్గం మాటేమిటి? ఈ రెండు మార్గాలూ విజయం సాధించలేవుకదా?"

"సహజ కరుణామయ మందహాసంతో గురువు అన్నారు — "అహా, రెండూ సాధిస్తాయి. అవి సత్యపథాలు కాబట్టి."

చంద్రశేఖర్‌కు ఉద్రేకం అదుపు తప్పింది.

"అయితే స్వామీజీ! నా మార్గం విజయవంతమైతే మీకు పతనం తప్పదు. నాకు భగవంతునిలో విశ్వాసంలేదు, మతంలో విశ్వాసంలేదు. అత్యద్భుతాలు సాధించే ఒక్క విజ్ఞానశాస్త్రాన్నే నమ్ముతాను. పరమాణువు సత్యమనీ, జగత్తు సత్యమనీ అమెరికాలోనున్న నా గురువు చెప్పేరు. ఆ సత్యం అవిష్కృత

మైనప్పుడు మీ దేవుడు పతనమై నశిస్తాడు."

"అహా!" మందహాసంతో గురువు అన్నారు. "ఒక్క దేవుడు నాశనమైన నాడు వాని మృతదేహం నుంచి వందలాది దయ్యాలు పుట్టుకొస్తాయి. అవి దేవుళ్ళలాగే భ్రమింపచేస్తాయి. ఈ విధ్వంసక శక్తులతో ప్రపంచం నిండిపోతుంది. వాటినన్నిటినీ చంపగలవా? ఈ దయ్యాలను చంపడానికి మారణాస్త్రాల నిర్మాణంలో నీ సత్యాన్వేషణ అంతమవుతుంది."

చంద్రశేఖర్ కొంతసేపు ఆలోచించేడు. "అది అనివార్యం. సృష్టిలయాలు పక్క పక్కనే జరుగుతూంటాయి. సత్యాన్ని రక్షించడానికి ఏ అగ్నిపరీక్షకైనా అంగీకరిస్తాము. కాని, స్వామీజీ, మీ భావాలకు మేము భాగస్వాములం కాలేము. అవంటే రోత...."

గురువు మళ్ళీ మందహాసంతో; "మంచిది నాయనా, నా ఆశీర్వాదాలెప్పుడూ నిన్ను అంటి ఉంటాయి. అధమం ఒక్క మూలసత్యాన్ని బోధపరుచుకోడానికి ప్రయత్నించు. ప్రకృతి అంటే మనకు దృగ్గోచరమవుతూన్న బాహ్యరూపమేకాదు. ప్రకృతికి జీవముంది, వాణి ఉంది, ఆవేగముంది. మీరు పరిశోధనాగారాలలో దేనికై అన్వేషిస్తున్నారో, దానికోసమే మేమూ మా న వా త్మ ల అంతఃకుహరాలలో అన్వేషిస్తున్నాము. దానికి గీటురాయి అనుభూతి కాని, జ్ఞానంకాదు. ఈ సాయంకాలం ప్రార్థనలో పాల్గొంటే దాన్నిగురించి ఇంకా ఎక్కువగా తెలుసుకొంటావు." గురువు మళ్ళీ ఆశీర్వదించేరు.

## 4

దినమంతా చంద్రశేఖర్ ఈ మాటలను మననం చేసుకుంటూనే ఉన్నాడు. ప్రకృతికి విజ్ఞానానికి గల సంఘర్షణ ఫలితాన్ని మదింపు చేస్తున్నాడు. పంచభూతాలు మన చెప్పు చేతల్లో ఉన్నాయి. ఆధునిక పరిశోధనాగారంలో టెస్ట్ ట్యూబులోనే జీవం ప్రభవింపబోతూంది. నక్షత్ర లోకాల యాత్రకు మనిషి సిద్ధంగా ఉన్నాడు. అట్టి సర్వశక్తిసంపన్నుడైన మనిషి కాషాయి బురఖాల మాయా వాగ్జాలం ముందు ఎందుకూ కొరగాకుండా నీరసించడమా? అసంభవం!

సాయంకాలం, ఆకాశం నిర్మలంగా ఉంది. సంధ్యాకాంతి అరుణిమతో మిళితమైన అతిరిక్త కాంతి దివ్యదీప్తిగా భాసిస్తూంది. ప్రార్థనకు జనం చేరేరు. ఆ సభాస్థలికి ఆచ్ఛాదం నిర్మలాకాశం, దానిని పరివేష్టించి ఉన్నవి మహోన్నత హిమాలయాలు. మధ్య గురువు ఆశీనులై ఉన్నారు. రాజులు, జమీందారులు, విద్యావంతులు, బిచ్చగాళ్ళు వారి చుట్టూ కూర్చున్నారు. చంద్ర

శేఖర్‌ను కరాంగుళితో ఆదేశిస్తూ గురువు అన్నారు: "నాయనా, శాంతి రస్తు, శాంతిరస్తు. బహుశా ఇవేమీ నీకు నచ్చవేమో. పోనీ ఇదొక తమాషా అనుకో."

మనస్సు కూడదీసుకొని గురు సన్నిధానంలో డాక్టర్ కూర్చున్నాడు. తండ్రి పర్సునుంచి డబ్బు కాజేయడానికి ఉబలాటపడుతూన్న కుర్రకుంకవలె ఉత్తేజితుడైనాడు. ప్రారంభంలో గురువు వేదపఠనం చేసేడు. ఇతరులు పురశ్చరణ చేసేరు. ఒక్క క్షణంపాటు ఫిడేలు, వీణ మ్రోగేయి. ఏదో చంద్రశేఖర్ వింటున్నాడు. వెంటనే ఒక యోగి కొన్ని ఆసనాలు వేసేడు.

అమెరికానుండి వచ్చిన ఇంద్రజాలికుడు ఒక ప్రదర్శనమిచ్చేడు. బహుమతి పొందిన తన కవితను ఒక కవి వినిపించేడు. ఒక హాస్యగాడు ధ్వన్యనుకరణతో ఆనందింపచేసేడు. ఇదంతా రోడ్డు ప్రక్కవాటు మూకలాగ ఉందనుకొన్నాడు చంద్రశేఖర్. ఈ తమాషా చూడటానికా దేశ దేశాల నుండి వచ్చి జనం మూగడం?

ఇప్పుడు గురువు ముఖంలో మంద హాసరేఖలు లేవు. ఆయన ఒక్కసారి బిగుసుకుపోయేడు. ఒక చీకటికోణంలో కూర్చున్న మనిషివైపు చేతులు చూపిస్తూ "ప్రేమనాథ్! ఇలారా. ఒక్క పాట వినిపించు" అన్నారు. ప్రేమనాథ్ అంటే ఇదివరకు చూచిన అసంబద్ధమైన దుస్తులతో ఉన్న తల తిరుగుడు విదేశీయుడే అని చంద్రశేఖర్ గమనించేడు. సిగ్గుతో మెల్లగా ప్రేమనాథ్ వచ్చేడు. అతని చేతిలో ఫిడేలుంది. చిరు నవ్వుతో గోళ్లు కొరుక్కొంటూ ఒక్క నిమిషం నిలుచున్నాడు. సభాసదులను తేరిపార చూచేడు. పాట మొదలుపెట్టేడు.

బ్రెజీల్ గ్రామీణ వ్యవసాయదారుల జానపదగేయమైన జీవనగీతిని చంద్రశేఖర్ చాలాసార్లు విన్నాడు. తన దివ్యగాత్రంతో ప్రేమానంద్ ఆ గీతాన్ని ఆలపిస్తూంటే వాతావరణమే మారిపోయింది. కాఫీ తోటల ఘాటైన వాసన, ఛారమైన చేల పచ్చదనం, గుర్రాల సకిలింపులు, ప్రేమికుల ఏకాంత సంప్రదింపులు, హృదయాకర్షణీయమైన శిశువుల ముద్దుమాటలు; ఇవన్నీ చంద్రశేఖర్‌కు కనిపిస్తున్నాయి, వినిపిస్తున్నాయి. అనుభూతమవుతున్నాయి. పాట తారస్థాయిని అందుకొంటూంటే మెల్లగా తన మనశ్శరీరాలలో ఎగబ్రాకే స్పందాన్ని అనుభవిస్తున్నాడు. తన జన్మస్థలానికి, బాల్యావస్థకూ, తల్లిదండ్రులకు మిత్రులకు సంబంధించిన ఘట్టాలు సినీమా తెరమీదవలె మనోనేత్రం ముందు పదే పదే దృశ్యమానమవుతున్నాయి.

ప్రేమానంద్ మళ్ళా పాడేడు.

ఈసారి పాట వేరొక గళంతో, రాగంతో పెద్ద ఈలతో ప్రారంభమయింది. ఆ ఈల రణరంగంలో శంఖారావంలాగ ఉంది. సుశిక్షిత సైనికుల లయవిన్యాసంతో కూడిన గమనం దానిని అనుగమించింది. కవచాల సంఘర్షణ, బూట్ల రాపిళ్లు, విమానాల మ్రోత, కర్ణకఠోరమైన విస్ఫోటనాల ధ్వని, క్షతగాత్రుల ఆర్తనాదాలు, తుట్టతుదకు భీభత్సకరమైన పరమాణుశక్తి విజృంభణ....పాట ఆగింది. శ్రోతలంతా ఆశ్చర్యకరమైన నిశ్శబ్దంలో స్తంభీభూతులైనారు. నిశ్చేష్టితులైనారు.

తానొక ప్రపంచ మహా సంగ్రామ మధ్యమందున్నట్లు, ఒక పరమాణు బాంబు తన పరిశోధనాగారం పైన నేరుగా పడినట్లు, చంద్రశేఖర్ భావించేడు. సగం కాలుతూన్న శరీరాలు, విధ్వంసమైన పట్టణాలు, సర్వం స్వాహాచేస్తూన్న అగ్నిజ్వాలలు! అబ్బ! వినాశకరపథాన్ని అనుగమించినప్పుడు విజ్ఞానం ఎంత అమానుషమూ, భయానకమూ అయిన రూపాలు ధరించగలదు!

ప్రేమానంద్ ఒక వేడి నిటూర్పు విడిచేడు. చెమట తుడుచుకొన్నాడు. నక్షత్రస్థగిత ఆకాశం వైపు దృష్టిసారించి ఒక్క క్షణంపాటు యోచనా నిమగ్నుడైనాడు.

తరవాత ఫిడేలు వాయించ మొదలు పెట్టేడు. విచారగ్రస్తమైన మృదుస్వరం వెలువడింది. "ప్రభూ! నీవెక్కడున్నావు? ఎక్కడ?.... నీ వున్నావా? లేకపోతే నీవు నా హృదయంలో ఎలా జొరబడ్డావు? ఒకసారి అపారంగా మరోసారి నిర్దాణంగా ఉండే నా నవ్వులూ కన్నీరూ ఎక్కడ జన్మించేయి? ఎప్పుడు జన్మించేయి? బహుశా అనంతయుగాల క్రిందట. వీటి అన్నిటికి బాధ్యులెవ్వరు! ఈ ప్రశ్నను ప్రపంచం అనాదిగా అడుగుతూంది. నక్షత్ర గ్రహాలు చర్చిస్తూనే ఉన్నాయి. స్పందిస్తూన్న మానవాత్మతో విశ్వమంతా ఈ ప్రశ్ననే ప్రతిధ్వనిస్తూంది. ప్రభూ నీ వున్నావా? ఉంటే ఎక్కడున్నావు? ఎక్కడున్నావు! ఎక్కడ?...."

మానవాత్మ సారమంతా ప్రేమనాధ్ ఫిడేలు తీగలనుండి ప్రవహిస్తూంది. హృదయానందకరమైన శ్రీకృష్ణునిగానం, హృదయ విదారకమైన రాధ ఆర్తనాధం ఆ భావ సమ్మేళనమే జీవితము.

ప్రభూ! నేను నీ దర్శనం అపేక్షించను; శక్తిని, జ్ఞానాన్ని కూడా అర్థించను. సర్వజీవరాశిని ప్రేమిస్తూ నీ సేవచేసుకొనే అవకాశం ప్రసాదించు. దేవా! ఆ ఒక్క అవకాశం, ప్రేమ, ప్రే....మ...."

ఈ చరణాలు పాడుతూన్నప్పుడు ప్రేమానంద్ ప్రేమజ్వాలలలో మండుతున్నాడు. కన్నీరు మున్నీరుగా కన్నుల నుండి జాలువారుతూంది. మోహంలోకి,

కళ్ళలోకి రక్తం ప్రవహించింది. ఊపిరి ఆడలేదు. అకస్మికంగా ఫిడేలు జార విడిచి, మెల్లగా నిశీధిలోనికి జారు కొన్నాడు.

చంద్రశేఖర్‌కు విజ్ఞాన జనిత అహంకారం తొలగిపోయింది. పునరుజ్జీవింపచేసే కిరణ మొకటి ప్రకృతి అంతరాత్మనుండి వెలువడి వాని హృదయాన్ని తాకింది. ఇంతకాలం తను వేదాంతమని భావిస్తూన్నది, కలలోనైనా ఊహించలేనిది యదార్థంగా ఉన్నదన్న జ్ఞానం కలిగింది. విశ్వరహస్యాలను ఆవిష్కరించే అమోఘ ప్రయత్నంలో నిమగ్నుడైయున్న విజ్ఞానికి జ్ఞానాన్నీ, ఉత్సాహాన్ని, కార్యశూరత్వాన్నీ ప్రసాదించే శక్తికి ఇదే మూలమేమో?

5

చంద్రశేఖర్ వైపు తిరిగి గురువన్నారు- "కుమారా! మానవాత్మయొక్క శాశ్వతవాణి అయిన సత్యవాణి విన్నావా?"

డాక్టర్ మాట్లాడలేకపోయేడు. స్వామిజీ- "రెండు విశ్వవిద్యాలయాలలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాలు పుచ్చుకొన్నాడు ప్రేమనాధ్. విజ్ఞానశాస్త్రజ్ఞుడు కూడా. భౌతిక ప్రపంచాన్ని పొరలు పొరలుగా పరీక్షించేడు. ఉల్లిపాయ పొరలు ఒలిచినట్లే ఉందని గమనించేడు. నికరమైన అభిప్రాయానికి రాలేకపోయేడు. ఈనాడు మానవాత్మ గంభీర కుహరాలలో జొచ్చి, పరమాత్మను మరుగుపరచిన తెరను తొలగించే ప్రయత్నంలో ఉన్నాడు. ఇది కౌటిల్యమంటావా?"

చంద్రశేఖర్ ఏదో చెప్పబోయేడు. గళం మూగపోయింది. అప్పుడు గురువన్నారు:

"శాంతించు నాయనా! నీవు విజ్ఞానశాస్త్రవేత్తవు. నీ అంతరంగంలో నిరంతర సత్యాన్వేషణ సాగుతూందని నేనెరుగుదును. సత్యమార్గాన్ని, పరమ సత్యమార్గాన్ని అనుగమించేవారెప్పుడూ ధన్యులే. కాని, సులభంగా సత్యం ఆవిష్కృతంకాదు. నిరంతర అన్వేషణ నీకు జయం చేకూర్చుతుంది. లే, నాయనా, లే! ఈ అన్వేషణకు నాయకత్వం వహించు. నీ మార్గం పూలబాట అగుగాక! అయితే, సత్యాన్వేషణ మానవ చైతన్యాంతరంగంనుండీ జరుగుతుంది, బాహ్య ప్రకృతినుండీ జరుగుతుందన్న సత్యం ఏనాడూ విస్మరించకు."

(అనువాదం : వసంతరావు వేంకటరావు)